ఆగస్టు 15న

## అన్నా క్యాంటీన్లు ప్రారంభం

**మంత్రి నారాయణ వెల్లడి**



నిరుపేదలకు అతి తక్కువ రేట్లకే నాణ్యమైన ఆహారాన్ని ఆహ్లాదకర వాతావరణంలో అందించే అన్నా క్యాంటీన్లను ఆగస్టు 15 నుండి రాష్ట్రంలో ప్రారంభించనున్నట్లు మున్సిపల్ శాఖ మంత్రి డా. నారాయణ తెలిపారు.

లోపల పేజీలో

## చంద్రబాబు పాలన అధ్వానం

- మాజీ మంత్రి కాకాని



చంద్రబాబు గత 40 రోజులు పరిపాలన అధ్వానంగా మారిందని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. గురువారం నెల్లూరు నగరంలో డైకస్ రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

వివరాలు 08లో

నేటి దినపత్రిక
# సూర్య
17 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం | 19 జులై 2024 | పేజీలు 8



ఆత్మకూరుకు పరిశ్రమలపై

- మంత్రి 'ఆనం' ప్రత్యేక దృష్టి

# పెరుగుతున్న ఆశలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :**

ఆత్మకూరు ప్రాంతానికి పరిశ్రమలు రావడం గగనమేనా, తరలిన పరిశ్రమ స్థానే ఇతర పరిశ్రమ ఏర్పాటు హుళక్కేనా, నిరుద్యోగుల ఆశలు అడియాశలేనా అని సర్వత్రా వ్యాఖ్యానిస్తుండగా ఇటీవల రాష్ట్రంలో నూతనంగా తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు కావడం, ఆత్మకూరు అభివృద్ధి ప్రదాత, సీనియర్‌నేత ఆనం రామనారాయణరెడ్డి ఇక్కడ ఎమ్మెల్యేగా ఘనవిజయం సాధించడం, రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకోవడంతో అందరిలో మళ్లీ పరిశ్రమల ఆశలు పెరిగాయి. నురుద్యోగులు ఎంతగానో ఆశతో విశ్వాసంతో కన్పిస్తున్నారు. ఏడాదిన్నర క్రితం పట్టణంలో బస్టాండు ప్రారంభోత్సవ సమయంలో అప్పటి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి రెండు నెలల్లో పరిశ్రమ సాధిస్తామన్న హామీ నెరవేరేనా.. అంటూ ఆశలు పెంచుకున్న యువతకు నిరాశే మిగిలింది. ఆయన ఇచ్చిన హామీ నెరవేరక పోగా ఆయన పదవీకాలం ముగియడం, ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయన మళ్లీ వైసీపీ అభ్యర్థిగా పోటీ చేయడం, ఓటమి చెందడం తెలిసిందే. ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలంలోని నారంపేట వద్ద నెల్లూరు-ముంబాయి రహదారిపై ఎంతో ఆర్భాటంగా 2002 సెప్టెంబర్‌లో

- మెట్టప్రాంతంపై గత సర్కారు వివక్ష !



-మిగతా 2లో

రాబోయే రెండేళ్లలో..

## అద్భుతమైన రాజధాని



- అన్ని వ్యవస్థలను సమీక్షించి వైట్ పేపర్‌ను విడుదల చేస్తున్నాం
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేస్తాం
- విజయ్ సాయి రెడ్డి వ్యాఖ్యలు జుగుప్సాకరం
- మీడియా వారి పట్ల విజయసాయిరెడ్డి వైఖరి గర్హనీయం
- దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

రోడ్డు విస్తరణ గ్రహణం

## తొలిగించేనా !



ఆత్మకూరు పట్టణంలోని ప్రధానరహదారి కొంతమేరకు విస్తరణ పనులు నిలిచిపోయి ఒకటి కాదు,రెండుకాదు తొమ్మిదేళ్ళవుతున్నా ఎవరూ పట్టించకోవడం లేదని, ఇంకా గ్రహణం వీడడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

వివరాలు 3లో

రెండో రోజు రొట్టెల పండుగకు..

# పోటెత్తిన జనం

- సుమారు 2 లక్షల మందికి పైగా విచ్చేసిన భక్తులు
- 80 వేల మందికి పైగా భక్తులకు ఉచిత అన్నదానం
- అడుగడుగునా పరిశుభ్రతకు పెద్దపీట
- వైద్య శిబిరాల్లో భక్తులకు ఉచిత వైద్య సేవలు

5 లో

నెల్లూరు బారాషహీద్ దరాలో ప్రారంభమైన రొట్టెల పండుగకు రెండో రోజు భక్తులు పోటెత్తారు. గురువారం సుమారు 2 లక్షల మందికి పైగా భక్తులు దర్గాను దర్శించుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.







# నిఘా నీడలో..

- బారాషాహీద్ దర్గా ప్రాంగణం
- గంధ మహోత్సవానికి పగడ్బంది ఏర్పాట్లు
- పోలీస్ బందోబస్తును పరిశీలించిన ఎస్పీ కృష్ణకాంత్

వివరాలు 3లో

# వాహనదారులు హెల్మెట్ల పట్ల అవగాహన పెంచుకోవాలి



## 1కె రన్‌లో న్యాయమూర్తి రాజేష్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి సురక్షిత ప్రయాణం చేసేలా అవగాహన పెంపొందించుకోవాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవా అధికార సంఘం చైర్మెన్ బి.రాజేష్ కోరారు. హెల్మెట్ల వినియోగం గురించి అందరికీ అవగాహన కల్పించాలన్న లక్ష్యంగా 1కె రన్ కార్యక్రమం నిర్వహించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, విద్యార్థులు తదితరులు స్థానిక సీనియర్ సివిల్ జడ్జి.. కోర్టు వద్ద నుండి ఎల్ఆర్ పల్లిలోని ఆర్టీసీ డిపో వరకు వారు ర్యాలీగా నినాదాలు చేయిస్తూ.. ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. రన్ నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి రాజేష్ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో అత్యధికంగా మృతి చెందిన వారు హెల్మెట్లు లేకుండా ప్రయాణాలు చేసినందునేనని పేర్కొన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు ధరించి ప్రయాణం చేయడం అత్యంత సురక్షితమని, ప్రాణాపాయ పరిస్థితి నుండి తప్పించుకోగలరని రాజేష్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు కూడా అందరూ హెల్మెట్లు తప్పకుండా వినియోగించాలని ఉత్తర్వులిచ్చిందని ఆయన పేర్కొన్నారు. ద్విచక్రవాహనదారులంతా తగిన అవగాహన కలిగి వెంటనే హెల్మెట్లు వినియోగానికి అలవాటుపడాలని రాజేష్ కోరారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్‌జడ్జి ఎల్.జగదీష్‌కుమార్, బార్ అసోసియేషన్ సభ్యులైన న్యాయవాదులు, ఉపాధ్యాయులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపీ వేమిరెడ్డిని సన్మానించిన 'దావా'



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :**
నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గురువారం ఆత్మకూరుకు చెందిన రాష్ట్ర టీడీపీ కార్యదర్శి దావా పెంచలరావు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించడాన్ని పురస్కరించుకొని వేమిరెడ్డిని శాలువాతో సన్మానించిన దావా అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో తెలుగు దేశం అధికారంలోకి రావడం, ఆత్మకూరులో తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన ఆనం రామనారాయణరెడ్డి ఘన విజయం సాధించడం, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన వేమిరెడ్డి ఘన విజయం సాధించడం తదితర అంశాలను గురించి వారు చర్చించుకున్నారు. కార్యక్రమంలో దావా అనుచర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గంధం మహోత్సవానికి మంత్రి 'ఆనం'కు ఆహ్వానం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని శ్రీశ్రీశ్రీ హజరత్ సయ్యద్ సుల్తాన్‌షాహిద్ ఔలియా వారి గంధం మహోత్సవంలో పాల్గొనాలని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఉత్సవ నిర్వాహకులు, తెలుగుదేశం నాయకులు ఆహ్వానించారు. గురువారం వారు మంత్రిని క్యాంప్ కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అత్యంత ఘనంగా నిర్వహించే ఈ గంధం మహోత్సవంలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం జరుగుతుందని కూడా వారు మంత్రికి తెలిపి ఉత్సవాల్లో, అన్నదాన కార్యక్రమంలో పాల్గొనాలని మంత్రి రామనారాయణరెడ్డిని ఆహ్వానించారు. కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, ఆత్మకూరు మాజీ ఉపసర్పంచ్ చల్లా రవికుమార్‌రెడ్డి, దర్గా కమిటీ అధ్యక్షుడు అబ్దుల్‌బషీర్, మున్నా, నాయబ్ రసూల్, బషీర్‌సా, ముజీబ్, వాజీద్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరుకు పరిశ్రమల పట్ల పెరుగుతున్న ఆశలు



తారురోడ్లు వేసిన దృశ్యం




**(మొదటి పేజీ తరువాయి)**

శంఖుస్థాపన చేసి, పార్కు పనులు జరుగుతుండగా, ఇక్కడకు ప్రతిపాదించి ఏర్పాటుకు తలపెట్టిన ప్లాస్టిక్ పరిశ్రమను ముఖ్యమంత్రి కడప జిల్లా బద్వేలు నియోజకవర్గంలోని గోపవరంకు తరలించడం.. ఇది అన్యాయం ! అని అఖిల పక్ష నాయకులు తీవ్రంగా విమర్శించడం, నారంపేటవద్ద పారిశ్రామిక పార్కు ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనసేన, బీజేపీ, టీడీపీ, సీపీఎంల నాయకులు ఆ పరిశ్రమ తరలింపు నిలిపివేయాలని డిమాండ్ చేయడం తెలిసిందే. కాగా ఈ పరిశ్రమను సాధించిన దివంగత రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి ఆశయ సాధనకు ముందుకొచ్చి ఉప ఎన్నికల్లో ఆయన సోదరుడు, వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి విజయం సాధించడం తెల్సిందే. అన్న ఆశయ సాధనలో భాగంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసు కుంటారా.. అని పలువురు చర్చించుకుం టుండగా, ఆత్మకూరు పట్టణంలో బస్టాండు ను ప్రారంభించిన సందర్భంగా నారంపేట పారిశ్రామిక పార్కు వద్దకు మరో రెండు నెలల్లో ఒక పరిశ్రమను మంజూరు చేయిస్తానని విక్రమ్‌రెడ్డి హామీ ఇచ్చారు. దాంతో యువతలో ఆశలు మళ్లీ చిగురించాయి. కానీ ఆ హామీ నెరవేరలేదు. మళ్లీ ఇటీవల ఎన్నికల్లో హామీ ఇచ్చారు. కానీ ఆయన ఓటమి చెందారు. గతంలో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం రావడం, ఇక్కడ ఎమ్మెల్యేగా ప్రాతి నిధ్యం వహిస్తున్న మేకపాటి గౌతంరెడ్డి రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో అందరిలో ఆశలు పెరిగాయి. నారంపేట వద్ద పరిశ్రమ విషయం పలువురు గౌతంరెడ్డి దృష్టికి తీసుకెళ్ళగా, ఆయన ప్రత్యేక దృష్టి సారించి నారం పేట వద్ద రైతులకు పరిహారం చెల్లింపజేసి భూసేకరణ పూర్తయ్యాక పారిశ్రామిక పార్కు ఏర్పాటు, ఒక పరిశ్రమ ఏర్పాటుకు అను మతి సాధించారు. ఇక్కడ రూ.28 కోట్లతో ఇండస్ట్రియల్ పార్కు పనులకు 2020 సెప్టెంబరులో గౌతంరెడ్డి శంఖుస్థాపన గావించారు. గౌతంరెడ్డి 2022 ఫిబ్రవరిలో గుండెపోటుకు గురై హఠాన్మరణం పొంద డం తెల్సిందే. అయితే అంతకు ముందే ఆయన ఉండగానే దాదాపు 84 ఎకరాల భూమిని నష్టపరిహారం చెల్లించి సేకరించ డం, ఇక్కడ సెంచరీ ప్లైవుడ్ ఫ్యాక్టరి ఏర్పాటు చేసేలా నిర్ణయించడం జరగ్గా, ఈ పరిశ్రమను బద్వేలు ప్రాంతంకు తరలించిన ముఖ్యమంత్రి శంఖుస్థాపన కూడా గావించగా.. అక్కడ పనులు శరవేగంగా పూర్తవుతున్నాయి. మెట్ట ప్రాంతంలో ఐటి శాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి ఒక పరిశ్రమ తెచ్చారు. తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 15 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశా లు లభిస్తాయని అందరు గంపెడాశతో ఉండగా, ప్రభుత్వం నీళ్లు చల్లిందని సర్వత్రా విమర్శించారు. విస్తరలో పంచభక్ష పరమా న్నాలు వడ్డించి నోటికాడ నుండి లాక్కొన్న ట్లుగా ఉందని సర్వత్రా ఆవేదన వ్యక్తం చేశారు. కాగా గౌతంరెడ్డి హఠాన్మరణం చెందడంతో ఇక ఆత్మకూరుకు పరిశ్రమలు రావడం గగనమని, పరిశ్రమ వచ్చిందని సంబరపడుతున్న ప్రజలు, కోటి ఆశలు పెట్టుకున్న యువతకు ఈ తరలింపు గొడ్డలి పెట్టుగా ఉందని, ఇక పరిశ్రమ ఏర్పాటు హుళక్కేనని సర్వత్రా వ్యాఖ్యానిస్తుండేవారు. గౌతంరెడ్డి అంత్యక్రియలు, ఉత్తరక్రియలు, సంస్మరణ సభ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విచ్చేయగా ఆయన తండ్రి, మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి ముఖ్యమంత్రితో మాట్లాడుతూ.. ఉదయగిరిలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు, వెలిగొండలు రిజర్వాయర్ పనులు, సోమశిల హైలెవల్ కెనాల్ పనులను ఫస్ట్‌ఫేజ్‌లో చేర్చి పూర్తిచేయించడం, డిగ్రీ కాలేజిని నాడు-నేడులో చేర్చడం గురించి మాట్లాడారే తప్ప, ఆత్మకూరు నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు, సోమశిల ప్రాజెక్ట్, నడికుడి-శ్రీకాళహస్తి రైలుమార్గం తదితరాల గురించి మాట్లాడలేదని, గౌతంరెడ్డి మృతి చెందడంతోనే ఇక ఆత్మకూరుకు పరిశ్రమలు రావడం ప్రశ్నార్ధకంగానే ఉందని పలువురు భావించసాగారు. గౌతంరెడ్డి సాధించిన పరిశ్రమను ముఖ్యమంత్రి తరలించి నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారని కూడా పలువురు వ్యాఖ్యానించారు. అయితే రెండేళ్ళ క్రితం ఆత్మకూరు నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో అన్న ఆశయ సాధన కోసం అంటూ.. గౌతంరెడ్డి వారసుడుగా విచ్చేసి ఘన విజయం సాధించిన విక్రమ్‌రెడ్డి పరిశ్రమల ఏర్పాటుకు శ్రద్ధ చూపుతున్నారని ఆ పార్టీ శ్రేణులు చెబుతుండేవారు. దాంతోపాటు బహిరంగ సభలో విక్రమ్‌రెడ్డి రెండు నెలల్లోనే ఒక పరిశ్రమ సాధిస్తానని, ఇంకా పలు పరిశ్రమలు కూడా మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అందరిలో ఆశలు రేకెత్తాయి. కానీ ఆ హామీ నెరవేరకపోగా రాష్ట్రంలో ఇటీవల సార్వత్రిక ఎన్నికలు జరిగి తెలుగుదేశం విజయఢంకా మ్రోగించి నూతన ప్రభుత్వం కొలువుతీరడంతో ఇక్కడ గతంలో అభివృద్ధిని పరుగులు తీయించిన మాజీ ఆర్థిక శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విజయం సాధించినందున ఆయన శ్రద్ధ చూపుతారని, యువత ఆశలు తీరుతాయన్న చర్చలు సాగుతున్నాయి. అదీగాక గతంలో నారంపేటవద్ద పరిశ్రమల ఏర్పాటుకు, పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు బీజం వేసింది రామనారాయణరెడ్డి కావడంతో ఎలాగైనా ఈ దఫా పరిశ్రమ సాధిస్తారని అందరూ భావిస్తున్నారు.
నడికుడి-శ్రీకాళహస్తి రైలుమార్గం, సోమశిల ప్రాజెక్టు పనులు. హైలెవల్‌కెనాల్ నిర్మాణం పూర్తి, ఆత్మకూరు మున్సిపాలిటీకి మహర్దశపట్టించడం, ఆత్మకూరుకు పరిశ్రమలు మంజూరు చేయించడంపై రామనారాయణరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత అధికారులతో చర్చిస్తూ సమీక్షిస్తూ గట్టిప్రయత్నాలు సాగిస్తున్నారు. దాంతో రైతులు, నిరుద్యోగులు, వారి తల్లిదండ్రులు, అన్నివర్గాల ప్రజలు అత్యంత విశ్వాసం, ఆశలతో ఉన్నారు.

కడప జిల్లాలో నిర్మాణంలో ఉన్న పరిశ్రమ



# నిఘా నీడలో.. బారాషాహీద్ దర్గా ప్రాంగణం

## గంధ మహోత్సవానికి పగడ్బందీ ఏర్పాట్లు - పోలీస్ బందోబస్తును పరిశీలించిన ఎస్పీ కృష్ణకాంత్



**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరులోని బారాషాహిద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండుగకు భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నడంతో దర్గా ప్రాంగణం, పరిసర ప్రాంతాలలో డ్రోన్, సీసీ కెమెరాలతో పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. గురువారం రొట్టెల పండుగ రెండవ రోజు సందర్భంగా కంట్రోల్ రూమ్ నుండి జిల్లా ఎస్పీ జి కృష్ణ కాంత్ స్వయంగా బందోబస్తును పరిశీలించారు. పోలీస్ సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు ఇస్తూ సిబ్బందిని అలర్ట్ చేస్తున్నారు. డ్యూటీలో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండకుండా పనిచేయాలని చెప్పారు. రాత్రికి జరగనున్న ప్రధాన ఘట్టం అయిన గంధ మహోత్సవంనకు పగడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. బారాషాహీద్ దర్గా, స్వర్ణాల చెరువులో అట్టహాసంగా, పూర్తి స్థాయి నిఘా నీడలో ప్రశాంతంగా రెండవ రోజు రొట్టెల పండుగ కొనసాగుతుందన్నారు. దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ తో కలిసి గంధమహోత్సవ విధివిధానాలు పరిశీలించారు. అలాగే మొదటి రోజు 92, రెండవ రోజు 140 మంది తప్పిపోయిన చిన్నారులను తల్లిదండ్రులకు, పెద్దలను వారి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చడం జరిగిందన్నారు. దొంగతనాలు పోల్పడుతున్న తొమ్మిది మంది పిక్ పాకెట్ సస్పెక్ట్ లను గుర్తించి, విచారించి పంపగా, పోగొట్టుకున్న 3 బ్యాగులను బాధితులకు సిసిఎస్ పోలీసులు అందజేయడం జరిగిందని తెలిపారు. డాగ్ స్క్వాడ్, బిడిటీంలతో నిరంతరం అణువణువు తనిఖీలు నిర్వహిస్తున్నారు. 1100 యాత్రికుల వాహనాలను ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకుండా పార్కింగ్ చేకున్నట్లు వెల్లడించారు. అనేక మంది వృద్ధులకు, దివ్యాంగులకు దర్గా దర్శనం, రొట్టెల మార్పిడికి అన్ని విధాల సహకరిస్తూ వారికీ దర్శనాలు, రొట్టెల మార్పిడి సజావుగా జరిగేటట్లు సేవలు అందిస్తున్న సిబ్బందిని ఎస్పి అభినందించారు. దర్గాలోనికి ప్రవేశం, నిష్క్రమ ప్రదేశాలలో బారికేడింగ్, ఘాట్‌లో రొట్టెల మార్పిడి ప్రదేశాలను స్వయంగా వెళ్ళి సందర్శించారు. యాత్రికుల భారీ వాహనాలను టౌన్ లోనికి రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. టౌన్ పరిధిలో ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా వాహనాలను నిర్దేశించిన ప్రదేశాలలో మాత్రమే పార్కింగ్ చేసి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ పరిశీలనలో అడిషనల్ యస్‌పి (అడ్మిన్) సౌజన్య, నగర డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, కావలి కావలి డిఎస్పి వెంకటరమణ, సంతపేట సిఐ సుబ్బరాజు, పోలీస్ అధికారులు, ఇబ్బంది పాల్గొన్నారు.



# రైతన్నల సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యం

### - కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు కార్డ్స్ సందర్భంగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే తెలుగుదేశం లక్ష్యమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. ఇందుకూరు పేట మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కౌలు రైతుల పంట సాగుదారు హక్కు కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. మండల పరిధిలోని కౌలు రైతులకు క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డ్స్‌తోపాటు పచ్చి రొట్ట ఎరువుగా భూసారానికి దోహదపడే జీలుగ విత్తనాలను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి రైతులకు అందచేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపధ్యంలో బ్యాంకులలో పంట రుణాలు పొందేందుకు అర్హులవుతారన్న విషయాన్ని గుర్తించి ప్రభుత్వం కౌలు రైతులకు క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డ్స్ అందచేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రస్తుతం కౌలు రైతులకు అందిస్తున్న పంట సాగుదారు హక్కు కార్డ్ ద్వారా ప్రభుత్వం రైతులకు అందించే విత్తన సబ్సిడీలతో పాటు ఇతర ఇన్ పుట్ సబ్సిడీలు పొందేందుకు అర్హులవుతారన్నారు. తుఫానులు ఇతర ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా పంట నష్టపోతే ప్రభుత్వం అందిచే అన్ని రకాల సహాయాలకు పంట సాగుదారు హక్కు కార్డ్స్ రైతులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఇందుకూరుపేట మండలంలో ఇప్పటివరకు మొత్తం 682 మంది కౌలు రైతులుండగా.. ప్రస్తుతం 355 మందికి పంట సాగుదారు హక్కుకార్డులు అందించడం జరుగుతుందన్నారు. కౌలు రైతులుగా ఉంటూ క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డ్స్ పొందని వారు ఎవరైనా వుంటే వారు ఆగష్టు 30 తేదిలోపు సమీప సచివాలయంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అధికారులు రాజ్ కుమార్, రఘునాద్‌రెడ్డి, తహసీల్దార్ రాజేష్, టిడిపి నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, మండల అధ్యక్షులు రావెళ్ళ వీరేంద్ర చౌదరి, చెంచుకిశోర్ యాదవ్, కోడూరు కమలాకర్ రెడ్డి ఎకొల్లు పవన్ రెడ్డి,స్థానిక నాయకులు ఆదిశేషారెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే రెండేళ్లలో అద్భుతమైన రాజధాని

- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తాం
- విజయసాయి రెడ్డి వ్యాఖ్యలు జుగుప్సాకరం
- మీడియా వారి పట్ల విజయసాయిరెడ్డి వైఖరి గర్హనీయం
- దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** రాబోయే రెండేళ్లలో అద్భుతమైన అమరావతిని నిర్మాణం చేసి రాష్ట్ర రాజధానిగా చేసేందుకు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని ఆనం నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. అన్ని వ్యవస్థల్లో అవినీతి చోటు చేస్తుందన్నారు. వాటిని వెలికి తీసి వైట్ పేపర్ ను నేడు విడుదల చేస్తున్నామన్నారు. గత ఐదేళ్లు కనీసం ఆంధ్రప్రదేశ్ కు రాజధాని కూడా లేదని, రాజధాని ఎక్కడ అని అడుగుతారు అన్న భయంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కనీసం సెక్రటేరియట్ కూడా రాలేదన్నారు. ఆయన మంత్రివర్గ సహచరుల పరిస్థితి కూడా ఇదేవిధంగా తయారయిందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి అమరావతిని రాజధానిగా అందించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని అమరావతిలో జంగిల్ క్లియరెన్స్‌కి రూ.36 కోట్లతో పనులను చేపడుతున్నామన్నారు. గత ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలను పెంచబోమని ఎన్నికల్లో హామీ ఇచ్చిన వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 15 సార్లు విద్యుత్ చార్జీలను పెంచిందని పేదలపై మోయలేని భారాలను మోపిందని ధ్వజమెత్తారు. రైతులకు, ప్రజలకు తమ ఆస్తులపై హక్కులు కోల్పోయేలా ల్యాండ్ టైటాలింగ్ యాక్ట్ అనే భయంకరమైన చట్టాన్ని తీసుకొని వచ్చిందన్నారు. ఈ యాక్టర్ త్వరలోనే తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం రద్దు చేస్తుందన్నారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో సహజ వనరులను అవేచ్ఛగా దోచుకున్నారని, ఇసుక, సిలికా, క్వార్జ్ ఇలా దేనిని వదల లేదన్నారు. ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న మీడియా, వారి ప్రతినిధుల పట్ల ఎంపీ విజయసాయిరెడ్డి వ్యాఖ్యలు జిగుప్సాకరంగా ఉన్నాయని విమర్శించారు. విజయ్ సాయిరెడ్డి నిరసిస్తూ సమావేశాలకు మీడియా ప్రతినిధులు వెళ్లకుండా ఉంటే మంచిదని ఆనం పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి మీడియా ప్రతినిధుల సహకారం ఎంతో అవసరమని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తమకు ఖాళీ ఖజానా ఇచ్చిపోయిందని ఆయన గుర్తు చేశారు. రాబోయే ఐదేళ్లలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతో రాష్ట్ర భవిష్యత్తు ఎంతో బాగుంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో టిడిపి నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, ఆనం రంగం మయూర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఆత్మకూరు పట్టణంలో రోడ్డు విస్తరణ గ్రహణం తొలిగించేనా !



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని ప్రధానరహదారి కొంత మేరకు విస్తరణ పనులు నిలిచిపోయి ఒకటి కాదు, రెండు కాదు తొమ్మిదేళ్ళవుతున్నా ఎవరూ పట్టించకోవడం లేదని, ఇంకా గ్రహణం వీడడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయమై ఎన్ని దపాలుగా ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తెస్తున్నా ఎవరూ స్పందించడం లేదు. ప్రధానమైన పట్టణంలోని మెయిన్‌రోడ్డు విస్తరణ ఆగిపోగా ఇంతటి నిర్లక్ష్యమా అని కూడా పలువురు ప్రశ్నిస్తున్నారు. అప్పట్లో కొందరు రోడ్డుకిరువైపులా ఉన్న గదుల యజమానులు అభ్యంతరం పెట్టడం, కోర్డులో స్టేపొందడం తదితర కారణాలతో పట్టణంలోని సోమశిల రోడ్డు సెంటరు నుండి ఆర్టీసీ డిపోవరకు రహదారి విస్తరణ, డివైడర్లు, సెంట్రల్‌లైటింగ్ పనులు నిలిచిపోయాయి. అయితే కోర్డు పెండింగ్‌లు కూడా పరిష్కారం కాగా ప్రభుత్వం నిధులు విడుదల చేయనందున పనులు పున:ప్రారంభం కావడం లేదని తెలుస్తోంది. 2012లో ఆనం రామనారాయణరెడ్డి ఉమ్మడి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నసమయంలో ఆత్మకూరు నియోజక వర్గంలో అనేక అభివృద్ధి పనులకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయించారు. అందులో భాగంగా నెల్లూరు-ముంబాయి రహదారిపై నెల్లూరుపాళెం నుండి పట్టణంలోని సోమశిల రోడ్డు వరకు ఆర్‌అండ్‌బి ఆధ్వర్యంలో, అక్కడనుండి పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయ భవనం వరకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిధులు వెచ్చించి రోడ్డును విస్తరించి డివైడర్లు, సెంట్రల్‌లైటింగ్ ఏర్పాటు చేశారు. అయితే సోమశిల రోడ్డు సెంటర్ నుండి ఆర్టీసీ డిపోవరకు కొందరు దుకాణాదారులు, భవనాల యజమానులు రోడ్డు మధ్య నుండి 35అడుగులు రోడ్డు విస్తరిస్తే తమ స్థలాలు కోల్పోవాల్సి ఉంటుందని, భవనాలు కొంత మేరకు తొలగించాల్సి ఉంటుందని అభ్యంతరం తెలిపారు. అప్పట్లో రామనారాయణరెడ్డి అధికారులు, భవనాల యజమానులతో చర్చించి 30 అడుగులుగా నిర్ణయించారు. అక్కడేమో సమ్మతి తెలిపిన కొందరు ఈనిర్ణయంపై కోర్టులో స్టేపొందారు. దాంతో అక్కడ రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. 2013లో ఈపనులు జరుగగా ఆర్టీసీ డిపో నుండి సోమశిల రోడ్డు సెంటరు వరకు పనులు జరగకుండా నిలిచిపోయాయి. అయితే కోర్టులో పెండింగ్‌లు తొలిగిపోగా నష్టపరిహారం చెల్లింపు, రోడ్డు పనులుకు రూ.3కోట్లుండగా రూ.6 కోట్లు అవసరమని ఆర్‌అండ్‌బి అధికారులు ప్రభుత్వానికి లేఖ రాశారు. అక్కడ నుండి నిధులు మంజూరు కాలేదు. ఈలోగా రోడ్డు గుంటలమయమై జనాలు,వాహనకారులు నానా అవస్థలు పడసాగగా ఆర్‌అండ్‌బి అధికారులుతాత్కాలికంగా తారు రోడ్డు వేశారు. డివైడర్లు, సెంట్రల్‌లైటింగ్‌కు మున్సిపాలిటీ నిధులు సిద్ధంగా ఉంచినా రోడ్డు విస్తరణ జరగనందున వారు ఆనిధులతో ఇతరత్రా పనులు చేపట్టారు. ఇక అప్పటినుండి ప్రభుత్వం నుండి నిధులు మంజూరు కాలేదు.

రోడ్డు విస్తరణకు పట్టిన గ్రహణం వీడడం లేదు. పట్టణంలో పాతహాలు సెంటరునుండి సోమశిల రోడ్డువరకు, ఆర్టీసీ డిపోనుండి నెల్లూరుపాళెఉం వరకు రోడ్డు విస్తరించి డివైడర్లు నిర్మించి సెంట్రల్‌లైటింగి వేయగా ఆకర్షణీయంగా ఉండగా మద్యలో మాత్రం రోడ్డు సింగిల్‌గా, సెంట్రల్‌లైటింగ్, డివైడర్లు లేకుండా ఉండగా ఈరోడ్డు జనాలకు, వాహనకారులకు అసౌకర్యంగా ఉంటోంది. మరి ఈరోడ్డుకు పట్టిన గ్రహణం వీడాలంటే నూతన శాసనసభ్యులు, రాష్ట్ర మంత్రివర్యులు ఆనం రామనారాయణరెడ్డి శ్రద్ధచూపాల్సి ఉంది.

# జనసేన క్రియాశీలక సభ్యత్వం నమోదు చేయించుకోండి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** గునుకుల కిషోర్ జనసేన పార్టీ నెల్లూరు జిల్లా కార్యాలయం, గోమతి నగర్ నందు జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం నాలుగో విడుదల కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రియశీలక సభ్యత్వం స్టార్ట్ చేసిన మొదట్లో గుండెలపై జనసేన పార్టీ ఐడి వేసుకోవడానికి ఎంత గర్వంగా భావించామో ఈరోజు పార్టీ గెలిచిన తర్వాత క్రియాశీలక సభ్యత్వం నమోదు చేయడానికి అంతే గర్వంగా భావిస్తున్నాం నూటికి నూరు శాతం గెలిచిన తర్వాత అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అప్పుజెప్పిన బాధ్యతను జనసేన నాయకులు, వీర మహిళలు జన సైనికులు బాధ్యతగా, ముందుకు తీసుకుపోండి గడిచిన సంవత్సర కాలంలో జనసేన పార్టీకి వచ్చిన ఆదరాభిమానాలు మరువలేనివి జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం ఎప్పుడెప్పుడు అని అడిగిన ప్రతి ఒక్కరిని సభ్యత్వంలో కలుపుకుంటూ అత్యధిక జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదులను చేయండి జాతీయ మీడియా ప్రతినిధి నెల్లూరు జిల్లా పర్యవేక్షకులు వేముల పాటి అజయ్ ఆధ్వర్యంలో గత సంవత్సరం 9500 ఉన్న సభ్యత్వాన్ని 50వేలు దాకా తీసు కెళ్లేందుకు మేమంతా కృషి చేస్తాం క్రియాశీలక ప్రారంభించినప్పటి నుండి నుంచి దాదాపు 344 మందికి ఐదు లక్షలొప్పున చొప్పున 18కోట్లు ప్రమాద బీమా ఇప్పటివరకూ అందించడం జరిగింది ఇంకా 90 మందికి ఇవ్వవలసి ఉంది ఈనెల 18 నుంచి 28 దాకా ప్రతిష్టాత్మకంగా ఒక మహా యజ్ఞం లాగా ఈ క్రియాశీలక సభ్యత్వాన్ని నమోదు చేయండి ఈ సభ్యత్వానికి ఒక ఫోటో, ఫోన్ నెంబర్, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు, వాలంటీర్లకు అందిస్తే ఐడి కార్డుతో పాటు క్రియాశీలక సభ్యత్వ కిట్ జిల్లా కార్యాలయంలో అందజేయబడుతుంది ఈ సభ్యత్వం తీసుకున్న వారికి జనసేన మద్దతు దారులకు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు హాస్పిటలైజేషన్ 50వేల రూపాయలు అలాగే ప్రమాదవశాత్తు మరణిస్తే 5లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ లభించడమే కాకుండా జనసేన పార్టీ కమిటీ లలో ప్రిఫరెన్స్ ఇవ్వబడుతుంది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యాలయ ఇన్చార్జి జమీర్, జనసేన నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్, శ్రీరామ్, కృష్ణారెడ్డి, రవి, నాగరత్నం యాదవ్, శ్రీపతి రాము, శేఖర్ రెడ్డి ఇతర సిటీ కోర్ పార్టీ కమిటీ కోర్ కమిటీ సభ్యులు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

# పందుల స్వైర విహారంతో గ్రామస్తుల ఆందోళన



- దుర్గంధపూరితంగా పరిసరాలు
- పట్టించుకోని పంచాయతీ

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలంలోని పలు గ్రామాల్లో పందుల స్వైర విహారం, పర్యావరణ పరిసరాలను దుర్గంధపూరితంగా చేస్తున్న వైనం గ్రామస్తులను ఆందోళనకు గురిచేస్తుంది. మురుగునీటి నిల్వల వద్ద వరహాలు ఆవాసాలు చేసుకుని ప్రాంతాలను చిద్రం చేస్తున్నాయి. మంచినీటి కొళాయిలు, చేతి బోర్లు వద్ద నిత్యం పదుల సంఖ్యలో పందులు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం మండల వ్యాప్తంగా విష జ్వరాలు ప్రజలను పీడిస్తున్నాయి. అతిసారం, డయోరియా ప్రబలి అనంతసాగరంలోని ఓ ప్రాంతం ప్రజలు గతంలో మంచాన బారిన పడ్డారు. ప్రస్తుత వర్షాకాల నేపథ్యంలో పందుల స్వైర విహారం త్రాగునీటిని కలుషితం చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. దోమల బెడద కూడా తీవ్రంగా ఉండడంతో మెదడు వ్యాపు సోకే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమశిల గ్రామంలో పందులు పదుల సంఖ్యలో గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. గతంలో గ్రామపంచాయతీకి పలు విన్నపాలు చేసిన సందర్భాలు ఉన్నాయి. వాటిని సుదూరంగా తీసుకువెళ్లాలని, పంచాయితీ పెంపకం దారులకు హెచ్చరికలు జారీ చేసి ఉన్నారు. అయినా వారు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఇకనైనా పంచాయతీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పెంపకం దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సర్వత్ర కోరుతున్నారు.

# నారాయణ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు







**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ చింతా రెడ్డిపాలెంలో నారాయణ మెడికల్ డెంటల్ కాలేజ్ విభాగంని 200 మంది స్టూడెంట్స్‌కి నెల్లూరు జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.హేనా సుజన్ 100 రోజుల స్పెషల్ అవెర్నెస్ సంకల్ప కింద విద్యార్థినిలకు వర్కింగ్ ప్లేస్‌లో సెక్సువల్ హరాస్మెంట్ యాక్ట్ 2013 పైన అందరికీ అవగాహన కల్పించడం జరిగింది. ఇందులో చైల్డ్ మ్యారేజ్ ఆక్ట్ గురించి ఫోక్సో యాక్టు గురించి సేఫ్టీ టచ్ అన్సాఫ్ టచ్ గురించి బాల కార్మికుల నివారణ చర్యలు గురించి దత్తత ప్రక్రియ గురించి ఐసిడిఎస్ సర్వీసెస్ గురించి అందరికీ అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అలాగే కాలేజీ టీం వందన, ఐసీడీఎస్, పిఓ సిహెచ్ సమత, కే.కీర్తి, కిల్కారి మొబైల్ అకాడమీ రీజనల్ ప్రోగ్రాం ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

## మూత్రపిండ వ్యాధులపై అవగాహన



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ మూత్రపిండ వ్యాధి నిపుణులు డాక్టర్ సునీష్‌రెడ్డి మూత్రపిండ వ్యాధుల గురించి మాట్లాడుతూ.. మూత్రపిండ వ్యాధులను ఎలా గుర్తించాలి, ముఖ్యంగా కాళ్ళ వాపులు, మూత్రం తరచుగా రావడం, డయాలసిస్ చేయించుకునేటప్పుడు ఎటువంటి ఆహారం తీసుకోవాలి, మూత్రపిండలను ఎలా కాపాడుకోవాలని అనే విషయాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డీవీ సుబ్బరాజు, కార్యదర్శి స్వర్ణ. రమేష్ బాబు, కోశాధికారి జయదేవ్, అసోసియేషన్ వ్యవస్థాపకులు మేకల నరేంద్ర రెడ్డి, కేఎంకే రెడ్డి, చింతల అమరేంద్ర రెడ్డి, గోపీనాథ్, గఫార్, గోపాలరెడ్డి, ఓబుల్ రెడ్డి, నారాయణ రావు, సుబ్బారామి రెడ్డి, లోకేష్ పాల్గొన్నారు.

## సచివాలయానికి ప్రముఖుల ఫోటోల వితరణ



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలం ఆమని సిరి వెళ్ల గ్రామ సచివాలయానికి టిడిపి నాయకులు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఫోటోలను వితరణ చేశారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం, డిప్యూటీ సీఎం ఫోటోలు తప్పక ఉండేలా చూడాలని రాష్ట్ర పార్టీ ఆదేశాలతో నాయకులు ఫోటోలను బహుకరించారు. మండలంలోని ప్రతి సచివాలయంలో ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ తరహా కార్యక్రమానికి నాయకులు శ్రీకారం చుట్టారు.

## పలు గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని కొండ్లపూడి, కలివెలపాలెం గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా మండల విస్తరణాధికారి పెంచల శ్యామ్ మాట్లాడుతూ.. గ్రామాలలో మురికి కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించడం, మంచి నీటి ట్యాంకులను శుభ్రపరచడం జరిగింది. పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి వీధి తిరిగి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## లింగంగుంటలో రైతుల అవగాహన సదస్సు



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలం లింగంగుంట గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో రైతు అవగాహన సమావేశం జరిగింది. కౌలు రైతుల పంటల సాగు హక్కు పత్రము పై మండల వ్యవసాయ శాఖ అధికారి బి.శ్రీనివాస చక్రవర్తి అవగాహన కల్పించారు.కౌలు రైతులు కూడా ప్రభుత్వ సబ్సిడీలకు, రుణాలకు ఎలాంటి హక్కులు కలిగి ఉన్నారన్న విషయాన్ని తెలిపారు. పంటల నష్టాన్ని ఆన్‌లైన్‌లో ఈ క్రాఫ్ చేసుకోవడం ద్వారా పొందే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ వి.నాగేంద్ర, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు



# రొట్టెల పండుగకు పోటెత్తిన భక్తులు

▶▶ సుమారు 2 లక్షల మందికి పైగా విచ్చేసిన భక్తులు ▶▶ 80 వేల మందికి పైగా భక్తులకు ఉచిత అన్నదానం

▶▶ ఏర్పాట్లు ఘనం.. సంతృప్తి వ్యక్తం చేస్తున్న భక్తజనం ▶▶ అడుగడుగునా పరిశుభ్రతకు పెద్దపీట

▶▶ వైద్య శిబిరాల్లో భక్తులకు ఉచిత వైద్య సేవలు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు బారాషహీద్ దర్గాలో ప్రారంభమైన రొట్టెల పండుగకు రెండో రోజు భక్తులు పోటెత్తారు. గురువారం సుమారు రెండు లక్షల మందికి పైగా భక్తులు దర్గాను దర్శించుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, జేసీ సేదుమాధవన్, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ శర్మద ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అన్ని చర్యలు చేపట్టడంతో భక్తులందరూ సజావుగా దర్గాను దర్శించుకుని, రొట్టెలు మార్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. కోర్కెలు తీరిన వారు రొట్టెలను వదలడం.. కోర్కెలతో వచ్చిన వారు ఆ రొట్టెలను స్వీకరించడం వంటి దృశ్యాలతో స్వర్ణాల చెరువు ఘాట్ పరిసర ప్రాంతాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి. జిల్లా యంత్రాంగం పటిష్టంగా చేపట్టిన ఏర్పాట్ల పట్ల సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు తృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## వైద్య శిబిరాలను వినియోగించుకుంటున్న భక్తులు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలు భక్తులకు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయి. ప్రత్యేక వైద్యు లను, సిబ్బందిని బ్యాచ్‌ల వారీగా నియమించి 24 గంటలూ భక్తులకు వైద్య సేవలందిస్తున్నారు. రెండో రోజు సుమారు 2వేల మంది పైగా భక్తులకు బిపి, రక్త పరీక్షలు, మందులు అంద జేసినట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారి పెంచలయ్య తెలిపారు.

## పారిశుద్ధ్య సిబ్బంది సేవలు భేష్

దర్గా పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తా చెదరాన్ని తొలగిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. దర్గా ప్రాంగణాన్ని ఏడు జోన్లుగా విభజించి పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం చేపడుతున్నారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు సెప్టిక్‌ట్యాంక్ వాహనాల ద్వారా శుభ్రపరుస్తున్నారు. దీంతో దర్గా పరిసరాలు పరిశుభ్రతతో కళకళలాడుతున్నాయి. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ ఎప్పటి కప్పుడు పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.



## అప్రమత్తంగా అగ్నిమాపక శాఖ

స్వర్ణాల చెరువులో ఏ చిన్న ప్రమాదం జరగకుండా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యం లో అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టారు. 24 గంటలూ అప్రమత్తంగా బోట్లు, రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచారు. దర్గా ఆవరణలో అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచారు.

## పటిష్ట బందోబస్తు

దర్గా ప్రాంగణంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, క్యూలైన్లు సజావుగా సాగేలా, శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలీస్ అవుట్ పోస్ట్ ద్వారా అనౌన్స్మెంట్ చేస్తూ ఎప్పటికప్పుడు భక్తులను అప్రమత్తం చేస్తున్నారు. తప్పిపోయిన చిన్నారులను, వృద్ధులను వెంటనే సంబంధికులకు అప్పగిస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు.

## భక్తులందరికీ అన్నదానం

రొట్టెల పండుగకు విచ్చేస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉచిత అన్నదానాన్ని వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో నాలుగు అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేసి భక్తులకు అందిస్తున్నారు. తొలిరోజు సుమారు 40 వేలకు మందికి పైగా భక్తులకు అన్నదానం చేయగా, రెండోరోజు 80 వేలమందికి పైగా అన్నదానం చేసినట్లు అధికారులు తెలిపారు.

















# మండల సమావేశానికి డుమ్మా కొట్టిన అధికారులు

## తాగునీరు సాగునీరు సరఫరాపై అధికారులను ప్రశ్నించిన : వైసిపి నేత వాసిపల్లి పద్మానాభ రెడ్డి




**జలదంకి, మేజర్‌న్యూస్ :** మండల ప్రజలకు సకాలంలో తాగునీరు, సాగునీరు అందించ డంలో మండల అధికారులు విఫలమవుతు న్నారని జలదంకి మండల సర్వసభ్య సమా వేశంలో ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్ శాఖల అధికా రుల తీరుపై కృష్ణాపాడు ఎంపీటీసీ వాసిపల్లి లీలావతి భర్త మండల వైసీపీ నేత వైసిపి నేత వాసిపల్లి పద్మానాభరెడ్డి ప్రశ్నించారు. పద్మనాభ రెడ్డి అడిగిన ప్రశ్నలకు అధికారాలు త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. జలదంకి పంచాయతీ ఉప సర్పంచ్ కూరపాటి మాల కొండారెడ్డి మాట్లాడుతూ.. నెహ్రూ నగర్‌లో ఉన్న వాటర్ ప్లాంట్‌ని పంచాయతీకి అప్పగించి ఆయా ప్రాంతాల ప్రజల దాహార్తిని తీర్చాలని అధికా రులను కోరారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను అధికారుల వద్ద గళం విప్పుతారని ఎంపీటీసీలను ఎన్నుకుంటే వారు మాత్రం ఎలాంటి సమస్యలను అధికారులు దృష్టికి తీసు కెళ్లడంలో విఫలమయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోచిపాతల వెంకట రమణయ్య అధ్యక్షతన గురువారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. సర్వసభ్య సమా వేశానికి ఆర్ అండ్ బి, ఫారెస్ట్, వెటర్నరీ, ఎలక్ట్రి కల్, ఆరోగ్యశాఖ, ఆర్టీసీ శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. వీరిపై జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తామని ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. ప్రతి 3నెలలకు ఒకసారి విధిగా నిర్వహించే మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు ప్రజాప్రతి నిధులు, అధికారులు డుమ్మా కొట్టడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా సమస్యలపై చర్చించవాల్సిన ప్రజా ప్రతినిధులు, అధికారి కంగా గైహాజరు కావడం ఏమిటిని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి విధిగా నిర్వహించే మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలు మొక్కుబడిగా మారుతున్నాయి. అదే క్రమంలో జలదంకి మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. మండల సర్వ సభ్య సమావేశాల్లో పలు సమస్యలు ప్రజాప్రతి నిధులు సభ దృష్టికి తీసుకుని రావటంలో విఫల మయ్యారు. వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదకలని వినిపించారు. సమావేశానికి హాజరైన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఏమి మాట్లాకుండా మిన్నకుండి పోయారు. ఈ సమావేశంలో గత సమావేశాల్లో చెప్పిన వాగ్దానాలకు పరిష్కారం గురుంచి ప్రజా ప్రతినిధులు ఎవ్వరు కూడా మాట్లాడలేదు. సాదా సిదాగా సమావేశం ముగించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ ఎన్.వాసు, వైస్ ఎంపీపీలు పాలవల్లి మాలకొండ రెడ్డి, మేకల ధనమ్మ, ఎంఈఓ లు శ్రీధర్,నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ అధికారి శైలజ, ఆర్డబ్ల్యుఎస్ ఏఈ సతీష్, పంచాయతీ రాజ్ శాఖ ఏఈ వాణి, ఏ పి ఎం శ్రీధర్, ఎంపిటిసి లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు టిడిపి వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# తాగునీరు రాక అవస్థలు పడుతున్న ప్రజలు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** గట్టుపల్లి పంచాయితీలోని తూర్పు వీదిలో నివసిస్తున్న తమకు తాగు నీరు లేక అవస్థలు పడుతున్నామని ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. గురువారం ఏంపిడీఓ రామచంద్రకి గ్రామ ప్రజలు వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గట్టుపల్లి పంచాయితీలోని త్షుర్పు వీధిలో నివసిస్తున్న తమకు సంవత్సరం నుండి తాగునీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నమని ఎన్ని సార్లు పంచాయితీ సెక్రటరీ, సర్పంచ్‌కి విన్నవించిన పరిష్కారించలేదని తెలిపారు. నీరు లేక కాలకృత్యలు తీర్చుకోలేని పరిస్థితి నెలకొన్నదన్నారు. గ్రామం మ్పొత్తం తాగు నీటిని సరఫరా చేస్తున్నారని ?త్షుర్పి వీధికి మాత్రమే తాగునీరు సరఫరా నిలిపివేశారని అడిగితే సర్పంచ్ సమాధానం దాటవేస్తున్నారని తెలిపారు. తాగునీటి కోసం చిన్న పెద్ద తేడా లేకుండ వీధిలో బోరు వద్ద బందెలు బారుతీరుతున్న ఉప్పు నీరు వాడుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో తాగేందుకు నీరు పుష్కలంగా ఉన్నప్పటికి గొంతు వరకు చేరటం లేదని తక్షణమే అదికారులు పాలకులు స్పందించి తాగు నీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో దానం రమేష్, మ్నెద్దు మల్లిఖార్జున, దాసరి బ్రహ్మయ్య, దానం బాలాజి రావు, బండ్లమూడి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి స్పందన



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన విడవలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు గురువారం నెల్లూరుకు చెందిన నారాయణ వైద్యశాల వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి మండలం నుంచి దాదాపు 200 మంది రోగులు హాజరై వివిధ వైద్య పరీక్షలను చేయించుకున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ఈ శిబిరంలో ఉచితంగా షుగర్ బిపి పరీక్షలు నిర్వహించడంతోపాటు వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి పరీక్షల నిర్వహించామన్నారు. అంతేకాకుండా వైద్య సేవలు అందించి ఉచితంగా మందులను కూడా పంపిణీ చేశామన్నారు. అంతేకాకుండా తీవ్రవ్యాధులతో బాధపడుతున్న వారికి నెల్లూరులోని నారాయణ వైద్యశాల నందు ఉచితంగా వైద్య సేవలు అందించటం జరుగుతుందని వారి కొరకు శుక్రవారం ఉచిత బస్సును ఏర్పాటు చేసి రోగులను నెల్లూరు వైద్యశాలకు తరలించడం జరుగుతుందన్నారు. నెల్లూరులోని వైద్యశాల నందు ఉచితంగా ఎక్సరే, స్కానింగ్ పరీక్షలను నిర్వహించడంతోపాటు ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారికి ఉచితంగా శాస్త్ర చికిత్సలు చేయడం జరుగుతుందన్నారు.

## కౌలు రైతులు గుర్తింపు కార్డు కలిగి ఉండాలి



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని చెల్లాయ పాలెం, కాలయకాగోళ్లు గ్రామాలలో కౌలు రైతుల కార్డుల రైతులకు మంజూరు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా మండల వ్యవసాయ అధికారి యం.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో ఉన్న రైతు సేవ కేంద్రాల పరిధిలోని రైతులకు పంట సాగుదారున్ని హక్కు ధ్రువీకరణ పత్రాలను ఈ ఆన్లైన్ ద్వారా మంజూరు చేయుటకు పంట నమోదుకు, సబ్సిడీలో విత్తనాలు, ఎరువులు పొందుటకు, ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టం వాటిలితే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం పొందుటకు, పండించిన పంటను వ్యవసాయ కేంద్రాల్లో అమ్ముకునుటకు రాష్ట్ర ప్రభుత్వం అందించే వివిధ రకాల ఇన్సూరెన్స్ కార్యక్రమాలు పొందుటకు కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించి వారికి కౌలు కార్డులను పంపిణీ చేయడం జరుగుతుందని ఈ కార్యక్రమంలో వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్వోలు, వీఏఏ పి.కళ్యాణి పాల్గొన్నారు.

## మా భూమి రికార్డులు తారుమారు చేశారు..

**- బాధితురాలు వాడ వెంకటసుబ్బమ్మ**



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** సీతారామపురం తహసిల్దార్ కార్యాలయంలో తమ భూమి రికార్డులు తారుమారు చేసి, పట్టాదారు ప్రమేయం లేకుండానే రెవిన్యూ అధికారులు అక్రమ రిజిస్ట్రేషన్‌కు ఎలా అవకాశం కల్పించారని, తమ భూమి ఇతరులకు ఎలా సంక్రమిస్తుందో తెలపాలంటూ తహసిల్దారును డిమాండ్ చేస్తూ నెల్లూరు ప్రెస్ క్లబ్ నందు బాధితురాలు వాడ వెంకట సుబ్బమ్మ, కుమారులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన భర్త లేట్ వాడ గోపయ్య పేరుతో ఉన్న సర్వే నెంబర్ 536 నందు 5.69 సెంట్లు పొలం భూమిలో అనాదిగా వర్షాధార పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. సదరు పొలం నందు తన భర్త, మామల సమాధులు కూడా ఉన్నాయన్నారు. తన పెద్ద కుమారుడుకి, చిన్న కుమారునికి పక్షవాతం ఏర్పడి చికిత్స నిమిత్తం ఆసుపత్రిపాలై ఉండగా ఇదే అదనుగా భావించి అక్రమార్కులు స్థానిక రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కై తమ భూమికి సంబంధించిన రికార్డులు తారుమారు చేసి స్థానికేతురులైన కడప జిల్లా ప్రొద్దుటూరు కు చెందిన షేక్ మహబూబ్ బి అను వారి పేరు మీద లోపాయి కారణంగా ఆన్లైన్ చేయించి వెంటనే మరొక జిల్లా అయిన నంద్యాల కోవెలకుంట సబ్ రిజిస్టర్ ఆఫీస్ నందు సయ్యద్ బీబీజాన్ పేరుమీద రిజిస్టర్ చేయించి వెంట వెంటనే ఎలాంటి విచారణలు లేకుండా ఇ పాస్ బుక్ మంజూరు చేసి ఉన్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ జరిపి అవినీతికి పాల్పడిన రెవిన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకొని, వెంటనే తమకు జీవనాధారమైన భూమిని తమకు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాడ వెంకటసుబ్బయ్య, వాడ శ్రీనివాసులు, వాడ రమణయ్య, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీలో అక్రమాలపై డిప్యూటీ సీఎంకు రిజిస్టర్ పోస్టు : ముత్తుకూరు గ్రామ సర్పంచ్ లక్ష్మి

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరు గ్రామపంచాయతీలో తనకు తెలియకుండా జరిగిన అవకతవకలు, గిరిజన సర్పంచిగా తానుపడిన బాధలు వేధింపులపై న్యాయం చేయాలని అక్రమాలపై విచారణ చేపట్టా లని రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఫిర్యాదు చేశామని సర్పంచ్ లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రకటన విడుదల చేయడం జరి గింది. అధికారులు, గత పాలకులు అవినీతి కిపాల్పడ్డారని తెలియజేస్తూ డిప్యూటీ సీఎం ఈమెయిల్‌కు, రిజిస్టర్ పోస్ట్ ద్వారా విషయాన్ని తెలియ జేశారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు.

# విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** విద్యుత్ ప్రమాదాల నివారణకు పాటించవలసిన జాగ్రత్తల గురించి అవగాహన సదస్సును గురువారం విద్యుత్ భవన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ వి.విజయన్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ లావణ్య లక్ష్మీ సూచనల మేరకు విద్యుత్ ప్రమాదాల భద్రతపై విద్యుత్ భద్రత సంచాలకులు, ప్రభుత్వ ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి, గుంటూరు వారు జారీచేసిన జాగ్రత్తల గురించి గృహ, వాణిజ్య, వ్యవసాయదారులు, రైతు కూలీలకు క్షేత్రస్థాయిలో ఏ విధంగా అవగాహన కల్పించాలి అనే అంశంపై సిబ్బందికి నేటి నుండి నెల్లూరు విద్యుత్ విజిలెన్స్ విభాగం సర్కిల్ ఇన్స్పెక్టర్, వారి సిబ్బంది అవగాహన సదస్సు కల్పిస్తారని తెలిపారు. ట్రాన్స్ కె జేఎండీ కెవిఎన్ చక్రధర్ బాబు ఆదేశాల మేరకు ఇప్పటికే విజిలెన్స్, ఆపరేషన్ ఫీల్డ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో డీటీఆర్ తెఫ్ట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నప్పుడు, విద్యుత్ ప్రమాదాల నివారణకు కూడా పాటించవలసిన జాగ్రత్తల గురించి అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుంది. మన నెల్లూరు జిల్లాలో పంటలను కాపాడుకునేందుకు, అడవి జంతువులు చంపేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ పెన్సింగ్, పొలాలలో తెగిపడి లేదా జారిపడి తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లు, ఇన్సులేషన్ పాడయిన ప్లగ్‌లు లేని వర్షాలకు నీట మునిగి ఉన్న విద్యుత్ మోటార్లు, అనధికారికంగా దోటీలు తొలగించడం, తడి బట్టలను విద్యుత్ సపోర్టు వైర్లకు వేలాడదీయడం, అజాగ్రత్తతో భవన నిర్మాణ కార్మికులు ఇనుపరాడ్లను విద్యుత్ తీగలకు తగిలే విధంగా పై అంతస్తులు చేర్చడం, తగు లైన్ క్లియరెన్స్ నిర్ధారణ లేకుండా ప్రవేటు ఎలక్ట్రిషన్లతో విద్యుత్ పనులు నిర్వహించడం అనేవి తరుచూ సంభవించే విద్యుత్ ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా గుర్తించడం జరిగిందని తెలిపారు. వినియోగదారులు వారి ఆవరణలోని అంతర్గత వైరింగ్‌కు ఉపయోగించే విద్యుత్ వైర్లు, స్విచ్‌లు, హోల్డర్లు, ఇతర పరికరాలను ఐఎస్ఐ నాణ్యత కలిగిన వాటిని ఉపయోగించడం ద్వార విద్యుత్ ప్రమాదాలను నివారించవచ్చు, వినియోగదారులు ఇంటిలోని స్విచ్ బోర్డులను భద్రతా ప్రమాణాలు పాటిస్తూ తగినంత ఎత్తులో అమర్చుకొనవలెను. వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లను ముట్టుకొనరాదు. తడి చేతులతో, తడి కాళ్ళతో ఉన్నప్పుడు స్విచ్‌లను వేయరాదు. తడి చేతులతో, తడి కాళ్ళతో ఉన్నప్పుడు స్విచ్‌లను వేయరాదు. విద్యుత్‌కి సంబంధించిన సమస్యల పరిష్కారం కొరకు సంబంధిత విద్యుత్ శాఖ సిబ్బందిని



మాత్రమే సంప్రదించవలెను. ఇతర ప్రయివేటు వ్యక్తులను సంప్రదించరాతోటలలో కానీ, పొలాలలో కానీ ఇతర ఏ ప్రదేశంలోనైనా విద్యుత్ ప్రసారం జరిగే తీగలు (కండక్టర్) తెగి పడి ఉంటే వాటిని నేరుగా తాకరాదు. వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి లేదా 1912కి తెలియచేయవలెను. విద్యుత్ వినియోగదారులు ప్రమాదాల బారిన పడకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మనం చేసే చిన్న చిన్న పొరపాట్లు వల్లే విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ప్రతిఒక్కరు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించి ప్రమాదాల భారినపడకుండా ఉండాలని తెలిపారు.

# ఏఎస్ పేటలో భారీ వర్షం

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేటలో భారీ వర్షం కురవడంతో దర్గాకు వచ్చిన భక్తులు యాత్రికులు తీవ్ర అవస్థలు పడ్డారు రొట్టెల పండుగ సందర్భంగా ఏఎస్ పేటలోని శ్రీ హజరత్ ఖాజా నాయబ్ రసూల్ వారి దర్గాకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు భక్తులు వచ్చారు. ఈ సందర్భంగా దర్గా వద్ద భక్తుల తాకిడి అధికమైంది. టూరిస్ట్ బస్సులు వాహనాల్లో వచ్చిన యాత్రికులు పార్కింగ్ స్థలాల్లో వాహనాలను నిలుపుతున్నారు. అయితే గురువారం భారీ వర్షం కురవడంతో పార్కింగ్ స్థలాల్లో సరైన వసతులు లేకపోవడంతో వంట చేసుకునేందుకు వీలు లేక అవస్థలు పడ్డారు దర్గా ఆవరణలో భక్తుల కోసం సత్రాలు మసీదులపై ఉన్న గదులలో భక్తులకు ఉండేందుకు కల్పించారు. ఏఎస్పేట దర్గాకు యాత్రికులు అధికంగా వస్తున్నప్పటికీ వర్షం కారణంగా దర్గా లోపల దర్శనం వెంటనే తిరుగు ప్రయాణం సాగిస్తున్నారు. దర్గాలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని మంచినీటి సౌకర్యం ఈవో మహమ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. అలాగే వర్షం కారణంగా మెయిన్ బజార్‌లో కొంతమేర ట్రాఫిక్ జామ్ అవుతూ కనిపించింది. అయితే పోలీసులు ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తూ ఉన్నారు. అలాగే వర్షంతో బస్టాండ్ సెంటర్లో వర్షపు నీరు నిలబడడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



# అతిరధమహారధుల జన్మస్థలం బట్టేపాడు

▶ చట్టసభలు, స్థానిక సంస్థలకు ప్రాతినిధ్యం



మాజీ శాసనసభ్యులు డాక్టర్ బమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి



మాజీ జెడ్పి చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ బమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి



మాజీ మండలాధ్యక్షుడు డాక్టర్ బమ్మిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి



మాజీ జెడ్పిటిసి మెంబర్ డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య



రాష్ట్ర ఖనిజాభివృద్ధిసంస్థ డైరెక్టర్ చిల్లూరు మంజూషా



మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కె.వి.శ్రావణ్ కుమార్‌రెడ్డి



మున్సిపల్ కౌన్సిలర్ కౌసల్యమ్మ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం బట్టేపాడు గ్రామం అతిరథ మహారథులైన నాయకులకు పుట్టినిల్లుగా కొనసాగుతోంది. ఆత్మకూరు పట్టణానికి 3కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈగ్రామం నుండి పలువురు నాయకులు చట్టసభలు, స్థానిక సంస్థలకు గతంలో, నేడు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈగ్రామానికి చెందిన దివంగత డాక్టర్ బమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి తొలుత ప్రభుత్వ వైద్యాధికారిగా కొనసాగి అనంతరం ఆత్మకూరులో స్వంతంగా బిఎస్ఆర్ హాస్పిటల్ ఏర్పాటు చేసి పేదల డాక్టర్‌గా పేరుగాంచారు. దాంతోపాటు ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా ఐదుదపాలు పోటీచేసి మూడుదపాలు శాసనసభ్యులుగా ఎన్నికై 15సంవత్సరాల పాటు ప్రజలకు సేవలందించారు. ఆయన క్యాబినెట్ ర్యాంకు కలిగిన రాష్ట్ర ఆర్థిక సంస్థ చైర్మన్‌గా మూడేళ్ళపాటు కొనసాగారు. ఆయన కుమారుడు, ప్రస్థుత వైసిపి నాయకుడు బమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఆత్మకూరు జెడ్పిటిసి మెంబరుగా గెలుపొంది జెడ్పి చైర్మన్ పదవిని పొంది ఐదేళ్ళ పాటు ప్రజలకు సేవలందించి పదవిలో కొనసాగారు. అంతకుముందు ఆయన జిల్లాలోని స్థానికసంస్థల నుండి శాసన మండలి సభ్యులుగా ఎన్నికై ఐదేళ్ళపాటు చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించి ప్రజలకు సేవలందించారు. డాక్టర్ సుందరరామిరెడ్డి తనయుడు దివంగత డాక్టర్ బమ్మిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి తమ స్వంత వైద్యశాలలో ప్రజలకు వైద్యసేవలందిస్తూ ఆత్మకూరు ఎంపిటిసి మెంబరుగా రెండుదపాలు ఎన్నికై ఒకదపా మండలాధ్యక్షుడుగా ఎన్నికై ఐదేళ్ళపాటు మండల ప్రజలకు సేవలందించారు. ఆయన ఆత్మకూరు మేజర్ పంచాయతీకి సర్పంచ్‌గా ఎన్నికై ఐదేళ్ళపాటు సేవలందించారు. ఆయన ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపోకమిటీ గౌరవాధ్యక్షుడుగా ఆరేళ్ళపాటు కొనసాగారు. జిల్లా టెలికం సలహా మండలి సభ్యులుగా నియమితులై రెండేళ్ళపాటు కొనసాగారు. ఆయన జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శిగా కూడా కొనసాగారు. ఈగ్రామానికి చెందిన ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు, వైసిపి నాయకులు, మున్సిపల్ జెసిఎస్ కన్వీనర్ డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య ఆత్మకూరులో స్వంత వైద్యశాలనిర్వహిస్తూ వైద్యసేవలందిస్తూనే ఆత్మకూరు మండల జెడ్పిటిసి మెంబరుగా ఎన్నికై ఐదేళ్లపాటు ప్రజలకు సేవలందించారు. ఆయన గతంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడుగా కూడా కొనసాగారు. ఆయన సతీమణి రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ డైరెకక్టర్‌గా కొనసాగుతుండగా గతంలో ఆమె రెండు దపాలు ఎంపిటిసి మెంబరుగా, ఒకదపా మున్సిపల్ కౌన్సిలర్‌గా కొనసాగారు. అదే గ్రామానికి చెందిన దివంగత నాపా పెంచలయ్య ఆత్మకూరు మండల జెడ్పిటిసి సభ్యులుగా ఎన్నికై ఐదేళ్ళ పాటు ప్రజలకు సేవలందించారు. ఒకే గ్రామానికి చెందిన బమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, డాక్టర్ చిల్లూరు ఆది శేషయ్య, నాపాపెంచలయ్యలు జెడ్పిటిసి మెంబర్లుగా ఎన్నికకావడం విశేషం. ఈ గ్రామానికి చెందిన ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్‌గా పనిచేసి రిటైర్డ్ కాగా ఆమె ఆత్మకూరు మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికై కొనసాగుతూ ప్రజలకు సేవలందిస్తున్నారు. ఆమె తనయుడు, ఆత్మకూరులోని అభిరామ్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కోడూరు శ్రావణ్ కుమార్ రెడ్డి మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికై మున్సిపల్ వైస్ చైర్మన్‌గా కూడా ఎన్నికై అటు వైద్యసేవ, ఇటు ప్రజాసేవలో కొనసాగుతున్నారు. ఇదే గ్రామానికి చెందిన దివంగత వాసిపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి బట్టే పాడు సొసైటి అద్యక్షు డుగా ఎన్నికై జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్‌గా నాలుగేళ్లు వ్యవహరించారు. ఈ గ్రామానికి చెందిన డాక్టర్ తూమాటి శశి ధర్‌రెడ్డి బట్టేపాడు మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులుగా ఎన్నికై కొనసాగుతూ ప్రజలకు సేవలందిస్తున్నారు. ఈ గ్రామానికి చెందిన పలువురు వైద్యులు, న్యాయవాదులు, అధికారులుండగా రాజకీయంగా కూడా అనేకమంది ప్రజా ప్రతినిధులుగా ఎన్నిక కావడం, ప్రజలకు సేవలందించడం విశేషం. ఈ నేతలంతా ప్రజాప్రతినిధులుగా గ్రామానికి పేరుప్రఖ్యాతులు గడించారు. ఏమైనా ఒక చిన్నగ్రామంలో ఇంతమంది ప్రజానాయకులుగా కొనసాగడం గమనార్హం.



ఎంపిటిసి మెంబర్ డాక్టర్ తూమాటి శశిధర్‌రెడ్డి



మాజీ జెడ్పిటిసి మెంబర్ నాపా పెంచలయ్య



# చంద్రబాబు పాలన అధ్వానం : మాజీ మంత్రి కాకాణి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** చంద్రబాబు గత 40 రోజులు పరిపాలన అధ్వానంగా మారిందని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. గురువారం నెల్లూరు నగరంలో డైకస్ రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు 40 రోజుల పాలనలో టిడిపి చేసిన అఘాయిత్యాలపై, దాడులపై వాస్తవాలతో కూడిన శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయన్నారు. ప్రతి విషయంలో అబద్ధపు శ్వేతపత్రాలు విడుదల చేసే చంద్రబాబు.. రాష్ట్రంలో తన 40 రోజుల పాలనలో మహిళలపై జరిగిన అఘాయిత్యాలు, తెలుగుదేశం నాయకులు చేస్తున్న దాడులు, హత్యలపై వాస్తవాలతో కూడిన శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మరీ ముఖ్యంగా పల్నాడు జిల్లాలో వైసీపీ నేతలపై టిడిపి నేతల దాడులు తీవ్రమవుతున్నాయన్నారు. నడిరోడ్డు మీద వైకాపాకు చెందిన రషీద్‌ను తెలుగుదేశం నాయకుడు జిలానీ దారుణంగా హతమార్చాడని ఆరోపించారు. టిడిపి నాయకుడు చేసిన దాడిని వ్యక్తిగత వివాదాల వల్లే హత్య జరిగిందని ఎస్పీ చెప్పడం దారుణమన్నారు. ప్రజల శాంతి భద్రతలకు రక్షణ కల్పించలేని ఇలాంటి ఎస్పీకి ఏపీలో పని చేసే అర్హత కూడా లేదన్నారు. రాష్ట్రంలో అరాచకాలు, దాడులు చేస్తున్న తెలుగుదేశం



నాయకులపై కఠిన చర్యలు తీసుకొని ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేసారు.

# ఆగస్టు 15న అన్నా క్యాంటీన్లు ప్రారంభం



### రాష్ట్ర మంత్రి నారాయణ వెల్లడి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నిరుపేదలకు అతి తక్కువ రేట్లకే నాణ్యమైన ఆహారాన్ని ఆహ్లాదకర వాతావరణంలో అందించే అన్నా క్యాంటీన్లను ఆగస్టు 15 నుండి రాష్ట్రంలో ప్రారంభించనున్నట్లు మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ వంగూరు నారాయణ తెలిపారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో 203 అన్నా క్యాంటీన్లను ప్రారంభించినప్పటికీ 183 క్యాంటీన్లు మాత్రమే ఫంక్షనింగ్ లోకి వచ్చాయని, వాటి ద్వారా రోజుకి దాదాపు 2.25 లక్షల మంది భోంచేసేవారని తెలిపారు. మిగిలిన 20 క్యాంటీన్లలో 18 క్యాంటీన్ల భవనాలు పూర్తవ్వగా, 2 క్యాంటీన్ల భవనాలు ప్రాధమిక దశలోనే నిలిచిపోయాయన్నారు. అయితే గత ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను అన్నింటినీ మూసేసి వాటిలో కొన్నింటిని వార్డు సచివాలయాలుగా మరికొన్నింటిని స్టోరేజ్ రూములుగా వినియోగంచుకోవడం జరిగిందన్నారు. ఆయా భవనాలు అన్నింటినీ పూర్తి స్థాయిలో క్యాంటీన్లుగా తీర్చిదిద్దేందుకు, అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులను వచ్చే నెల 10వ తేదీ లోపు పూర్తి చేసేందుకు టెండర్లను కూడా ఖరారు చేయడం జరిగిందన్నారు. గతంలో అక్షయ పాత్ర సంస్థ ఎంతో చక్కగా నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేసేదని, అదే తరహాలో, అదే రేట్లకు ఈసారి కూడా ఆహారాన్ని సరఫరా చేసేందుకు టెండర్లను కూడా స్వీకరించడం జరిగిందని, వాటిని ఈనెల 22వ తేదీన ఓపెన్ చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

# అవసరమైన ప్రతి పల్లెకు ఆర్టీసీ బస్సు : ఎమ్మెల్యే కాకర్ల సురేష్

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాల్లో అవసరమైన ప్రతిపల్లెకు ఆర్టీసీ బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. గురువారం డిపోకు కొత్తగా వచ్చిన బీహెచ్‌ఈఎల్‌కు ఉదయగిరి నుంచి నడిపేందుకు సూపర్ లగ్జరీ బస్సులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తన చేతుల మీదుగా రెండు కొత్త బస్సులను ప్రారంభించడం శుభ పరిణామం అన్నారు నియోజకవర్గంలో పలువురు తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఎన్నికల సమయంలో తన దృష్టికి వచ్చిందని ఉన్నతాధికారులతో మాట్లాడి ఏ ఏ ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించాలో చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలలో ఒకటి త్వరలో మహిళలకు ఆర్టీసీలు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు అన్నారు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు.



### రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

వైద్యశాలకు వచ్చి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. గురువారం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు వైద్యులు సిబ్బంది రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా బీపీని చూపించుకొని అనంతరం వైద్యశాలలో గదులను పరిశీలించారు. అలాగే వైద్యశాలలో చికిత్స కోసం వచ్చిన రోగులతో ఇక్కడ వైద్య సేవలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు ఎక్సే పని చేయడం లేదని ఆయన దృష్టికి తీసుకురావడంతో వివరాలను తనకు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి సీతారాంపురం మండల కన్వీనర్లు బయన్న, ప్రభాకర్, రాజు, రియాజ్, సందాని, సజెల్ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి జే.అంజయ్య పేర్కొన్నారు. గురువారం బస్టాండ్ సెంటర్ నుంచి కోర్టు వరకు న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది. ప్రజలతో కలిసి హెల్మెట్ ధరించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. హెల్మ్ ట్ ధరించకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపి పలువురు ప్రాణాలు కోల్పోతుండడంతో వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించి వాహనాలను నడ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రామారావు, మస్తాన్, తిరుపతయ్య, నాగార్జున, కోర్టు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన ఒంగోలు ఎంపీ

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** రొట్టెల పండుగ సందర్భంగా ముస్లిం మైనార్టీ ప్రజలకు ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం బారషాహిద్ దర్గాను ఒంగోలు పార్లమెంటు సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఒంగోలు పార్లమెంటు సభ్యులు మీడియాతో మాట్లాడుతూ.. రొట్టెల పండుగకు దేశం నుండి కాక ఇతర దేశాల నుండి భక్తులు ఎక్కువ సంఖ్యలో బారాషాహిద్ దర్గాకు వస్తారన్నారు. బారాషాహిద్ దర్గా వద్ద సౌకర్యాలు చాలా మెరుగ్గా ఉన్నాయని ఆయన అన్నారు. అలాగే స్వర్ణాల చెరువు వద్ద ఏర్పాట్లు కూడా చాలా బాగా ఉన్నాయని ఆయన తెలిపారు. నెల్లూరు దర్గాకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఆ అల్లా ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని ఆయన తెలియజేశారు. ఈ మీడియా సమావేశంలో పార్లమెంటు సభ్యులతో పాటు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

### వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలి



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** విద్యార్థులు ప్రాథమిక దశ నుంచి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని ఆత్మ పథకం పీడీ దొరసాని అన్నారు. మండలంలోని అలాగానిపాడు గ్రామంలో స్థానిక పాఠశాల విద్యార్థులతో కలిసి మట్టి నమూనా పరీక్షలను ఎలా చేయాలో అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే వ్యవసాయంపై అవగాహన కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం ఎస్ఎస్‌హెచ్‌పి అనే పథకాన్ని అమలులోకి తీసుకు వచ్చిందన్నారు. దీనిద్వారా విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కలిగించటం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా తొలుత మట్టి నమూనాలను ఎలా సేకరించాలో తెలియచేయడంతోపాటు మట్టిలో ఉన్న నత్రజని, సూక్ష్మ పోషకాలను వారికి తెలియజేసి దానిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. దీని ద్వారా విద్యార్థి దశ నుంచే వారికి వ్యవసాయంపై ఒక అవగాహన వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివ నారాయణ, కళ్యాణి, కన్నయ్య, అనూష, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

### జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించండి

**జాప్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవితేజ**




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలని జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవితేజ ఆధ్వర్యంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి గురువారం వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ అందజేసేలా జీవోను మరింత సరళీకృతం చేయాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులపై దాడులు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకుని వెళ్ళగా ఆయన సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు సంబంధించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు ధర్మసన ఉదయ్ కుమార్, పలువురు జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.